

స్వతంత్రానంతర ఎన్నికల చరిత్రలో తిరుపతిలో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థి బరిలో లేకుండా ఎన్నికలు జరగబోతున్నాయి. తిరుపతి ఎంపీ, అసెంబ్లీ స్థానాలను ఇండియా కూటమిలో భాగస్వాములైన మిత్రపక్షాలకు కేటాయించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. పార్లమెంటు స్థానాన్ని ఇప్పటికైతే ప్రకటించకపోయినా ఆర్పీఐకి కేటాయించినట్లు ఆ పార్టీ నాయకుడు అంజయ్య తెలిపారు. నిరంతరం జనంలో తిరిగే మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వంటి నాయకులున్న తిరుపతిలో ఇదేమి చిత్రమైన పరిస్థితి అని కాంగ్రెస్ అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అయ్యో పాపం కాంగ్రెస్!

- తిరుపతిలో ఆ పార్టీ లేకుండా తొలిసారి ఎన్నికలు జరగనున్నాయా?
- ఇండియా కూటమి మిత్రపక్షాల పేరుతో తెరవెనుక మంత్రాంగం నడిచిందా?
- చింతా మోహన్ పరిస్థితి ఏమిటి?

రాష్ట్ర విభజన తర్వాత జరిగిన 2014, 2019 ఎన్నికల్లో తిరుపతిలోనూ కాంగ్రెస్ పార్టీ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. అయినా ఆ పార్టీకి బలమైన అభిమానులున్నా వారంతా దాదాపుగా వైసీపీ నీడకిందకు చేరుకున్నారు. అయితే ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరగడం, ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల నియమితురాలు కావడం వంటి కారణాలతో కాంగ్రెస్‌లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఆ పార్టీకి రాష్ట్రంలోనే పెద్దదిక్కుల్లో ఒకరైన చింతా మోహన్ తిరుపతి కేంద్రంగానే రాజకీయ కార్యకలాపాలు నడుపుతుంటారు. కొవిడ్ రోజుల్లో తప్ప ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో జనంలో ఉంటున్నారు. 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ, 2021 ఉప ఎన్నికల్లోనూ ఆయన కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేశారు. అలాంటిది తిరుపతి ఎంపీ టికెట్ కోసం ఆయన గత వారం రోజులుగా ఢిల్లీలో మకాం వేయాల్సిన పరిస్థితి నెలకొందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తన కుమార్తె డాక్టర్ నీనాకు గూడూరు టికెట్ కోసం కూడా ఆయన ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఎంపీ సీటును ఆర్పీఐకి కేటాయించినది నిజమే అయితే చింతా రాజకీయ జీవితంలోనే ఇదో పెద్ద అవమానం కాగలదని అంటున్నారు. ఇక తిరుపతి అసెంబ్లీ సీటును సీపీఐకి కేటాయించడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి పోటీ చేస్తున్నారు. తిరుపతి నుంచి తమకు అవకాశం ఇవ్వాలని దొడ్డారెడ్డి రామ్‌భూపాల్ రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే కోరారు కూడా. నవీన్‌కుమార్‌రెడ్డి నేరుగా షర్మిలను కలసి అభ్యర్థించారు. వీరందరినీ నిరాశ పరిచారు.

ఎవరికి మిత్రపక్షాలు?

ఈ నేపథ్యంలో తిరుపతిలో ఒక ప్రచారం బలంగా వినిపిస్తోంది. వైసీపీకి ప్రధాన అండగా ఉన్న రెడ్డి సామాజిక వర్గంలో చీలిక రాకుండా ఉండడానికే తిరుపతి టికెట్ ఆశించిన ముగ్గురికీ కాంగ్రెస్‌లో అవకాశం ఇవ్వలేదని అంటున్నారు. ఈ ముగ్గురూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. తిరుపతిలో బంధుబలగం ఉన్నవారు. ఖచ్చితంగా ఎంతోకొంత ఓట్లను చీలుస్తారు. అందుకే మిత్ర పక్షం అంటూ కేటాయించేశారని చెప్పుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనుక చాలా నడిచిందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఇంకో విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే.. అసెంబ్లీకి భూమన అభినయ్‌తో తలపడాల్సిన సీపీఐ నాయకుడు మురళి, ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నానని ప్రకటించిన అంజయ్య.. ఇద్దరూ భూమన కరుణాకరరెడ్డికి సన్నిహితులు కావడం. ఆయన తిరుపతిలో అద్భుతమైన అభివృద్ధి చేశారంటూ వీరు సమావేశాల్లో కీర్తించారు కూడా. భూమన కుటుంబానికి బాసటగా వీరు నిలబడ్డారు. మరి ఇటువంటి వారు భూమన అభినయరెడ్డితో తలపడడం ఎలా సాధ్యం అనే విమర్శ బలంగా వినిపిస్తోంది.





శ్రీవారి ఆలయం ముందు జరుగుతున్న ఉగాది ఏర్పాట్లు

ఉగాది ఆస్థానానికి జోరుగా ఏర్పాట్లు

తిరుమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఉగాది ఆస్థానానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈనెల 9వ తేదీన ఉగాది ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది.ముందుగా తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత పఠనం తరువాత శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం వుంటుంది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కాగా, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 9న ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన అష్టదళపాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది.

10 టన్నుల పుష్పాలతో అలంకరణ

ఉగాది సందర్భంగా తిరుమల క్షేత్రాన్ని పది టన్నుల సంప్రదాయ పుష్పాలతో టీటీడీ అలంకరిస్తోంది. శ్రీవారి ఆలయంలో 5 టన్నులు, ఆలయం వెలుపల మరో 5 టన్నుల పుష్పాలను అలంకరణకు వినియోగించనుంది. అలాగే 60 వేల కట్ ఫ్లవర్స్‌ను ఆలయంలోని ధ్వజస్తంభం, బలిపీఠం,మండపాల స్తంభాలకు అలంకరణలో వినియోగించనున్నారు. భక్తులను ఆకట్టుకునేలా శ్రీవారి ఆలయం ముందు మత్స్యావతారంతో పాటు పలు అవతారాల ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే యుగాల సెట్టింగు పనులను కూడా ఆదివారం ఉదయం ప్రారంభించారు. మరోవైపు ఆలయంలోని అద్దాలమండపం వద్ద అయోధ్యరాముడి సెట్టింగ్ పనులను చేపట్టనున్నారు. ముఖ్యంగా నవధాన్యాలతో కూడా మత్స్యావతారాన్ని ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేయనున్నారు.విద్యుత్ అలంకరణ పనులనూ మొదలుపెట్టారు. సోమవారం రాత్రి 10 గంటలలోపు సంప్రదాయ కళ ఉట్టిపడేలా ఈ అలంకరణలన్నీ పూర్తిచేయనున్నారు.

మండిపోతున్న భానుడు

గూడూరు, సూళ్ళూరుపేటల్లో 44.8డిగ్రీలు

20 మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



గొడుగు లేకుంటే బయటకు రాలేం



తిరుచానూరు సమీపంలోని శిల్పారామం వద్ద ఇదీ పరిస్థితి

ఎండల దెబ్బకు తిరుపతిలో నిర్మానుష్యంగా కన్పిస్తున్న లక్ష్మీపురం సర్కిల్



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 7: ఏప్రిల్ మొదటి వారంలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. వడగాల్పులు, ఉక్కపోతతో జిల్లావ్యాప్తంగా ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన పెనుమార్పులే దీనికి కారణమని శాస్త్రవేత్తలంటున్నారు. మరో రెండ్రోజుల పాటూ ఎండలు ఇలాగే ఉంటాయంటున్నారు. ఉదయం 8 గంటల నుంచే వేడి వాతావరణం మొదలవుతోంది. సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. ఆదివారం జిల్లాలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.20 మండలాలకు పైగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.గూడూరులో 44.8డిగ్రీలు, సూళ్ళూరుపేటలో 44.7, చిల్లకూరులో 44.2, పిచ్చాటూరులో 43.8, తొట్టంబేడులో 43.7, నాయుడుపేటలో 43.5, డక్కిలిలో 43.3, కోట, ఓజిలి మండలాల్లో 42.9, చిన్నగొట్టిగల్లు, వెంకటగిరి, డీవీ సత్రం మండలాల్లో 42.8డిగ్రీలు, తిరుపతి, ఎర్రావారిపాళెం, ఆర్సీపురం మండలాల్లో 42.6డిగ్రీలు, శ్రీకాళహస్తిలో 42.4, పాకాల, నారాయణవనం, పుత్తూరు 42.3, చిట్టమూరు 41.8, రేణిగుంట 41.7, నాగలాపురం మండలాల్లో 40.6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 39.9డిగ్రీలు నమోదవడం చూస్తుంటే రాన్రానూ ఎండల తీవ్ర ఎలా ఉంటుందో అని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ అయిపోతానంటూ రూ. లక్షల్లో వసూళ్లు

లబోదిబోమంటున్న భాదితులు

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్ త్వరలో సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్) అవుతానంటూ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలో దీర్ఘకాలిక సెలవు పెట్టి అనేక వివాదాలతో పాటు గుప్తనిధుల వెలికితీత, రైస్‌పుల్లింగ్ వంటి వ్యవహారాల్లో వేలుపెట్టి పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఆయన తాజాగా కొత్త మోసానికి తెరలేపినట్టు సమాచారం. సీనియారిటీ ప్రకారం తనకన్నా ముందు వరుసలో జిల్లాలో పది మందికి పైగా సీనియర్ అసిస్టెంట్లు ప్రమోషన్ జాబితాలో వేచివున్నప్పటికీ వారందరినీ పక్కకు నెట్టి తాను సబ్ రిజిస్ట్రార్ ప్రమోషన్ తెచ్చుకుంటానని నాలుగు నెలల క్రితమే ప్రచారం మొదలు పెట్టినట్టు తెలిసింది.నిషేధిత జాబితాలోని దేవదాయ,మఠం, ప్రభుత్వ, డీకేటీ భూములతో పాటు పలు వివాదాల్లో ఉన్న ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసేస్తానని నగరంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బిల్డర్లకు, కొందరు డాక్యుమెంటు రైటర్లకు ఆశపెట్టినట్టు తెలుస్తోంది.తన ప్రమోషన్ కోసం సుమారు కోటి రూపాయల వరకు పై అధికారులకు సమర్పించాలని , తలా పది ఐదు లక్షలు సర్దుబాటు చెయ్యాలని నాలుగు నెలలుగా వసూళ్లు ప్రారంభించినట్టు చెబుతున్నారు. ఇతని మాటలు నమ్మిన కొందరు రూ.లక్షల్లో డబ్బులు సమర్పించుకున్నారు.చివరకు ప్రమోషన్ అయ్యే పనికాదని తెలుసుకున్న డబ్బులిచ్చిన వారు రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పిచ్చికుక్క కరిచి వృద్ధురాలి మృతి



పిచ్చికుక్క దాడిలో మృతి చెందిన సైదాన్‌బీ ఎడమచేతికి ఆపరేషన్ చేసి కుట్టువేసిన దృశ్యం

రేణిగుంట, ఏప్రిల్ 7: పిచ్చికుక్క కరిచి ఒక వృద్ధురాలు మృతి చెందిన ఘటన రేణిగుంట బుగ్గవీధిలో చోటు చేసుకుంది.బుగ్గవీధిలో నివాసముండే తల్లీకొడుకులు సైదాన్‌బీ(78),హుస్సేన్ కూలి పనులతో జీవనం సాగిస్తుంటారు.సైదాన్‌బీకి ఇటీవల కాలు విరిగిపోవడంతో కర్ర సాయంతో నడుస్తుంటోంది. ఈ నెల నాల్గవ తేదీ సాయంత్రం తన ఇంటి చివర్లో బహిర్భూమికి వెళ్లగా ఓ పిచ్చికుక్క సైదాన్‌బీని ఎడమచెయ్యి మణికట్టుతో పాటు పలు చోట్ల శరీరంపై కరిచేసింది.దీంతో కిందపడిపోయిన సైదాన్‌బీ వయసు మీరడంతో పెద్దగా అరవలేకపోయింది. బహిర్భూమికని వచ్చిన మరో వ్యక్తి అక్కడ పడిఉన్న సైదాన్‌బీని చూసి కుమారుడికి సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమెను హుటాహుటిన స్థానికంగా వున్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఇంజక్షన్‌తో పాటు కుట్లు వేయించారు. తీవ్రమైన నొప్పితో సైదాన్‌బీ ఇబ్బంది పడుతుండడంతో 6వతేదీ వుదయం తిరుపతి రుయాస్పత్రిలో చేర్చారు. అక్కడ ఈసీ, స్కానింగ్ తీసి చేతికి ఆపరేషన్ నిర్వహించి కట్టుకట్టారు.ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు చికిత్స పొందుతూ సైదాన్‌బీ మృతి చెందింది. సైదాన్‌బీని కరిచిన పిచ్చికుక్క ఇప్పటికి రెండు మూడు వీధుల్లో తిరుగుతూ ఏడుగురిని కరిచిందని తెలియడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈదులగుంట చెరువుకు చెర

- శ్రీకాళహస్తిలో బరితెగించిన భూ బకాసురులు
- పట్టపగలే పూడ్చి వేస్తున్నా పట్టని అధికారులు



ఈదులగుంట చెరువు చదును పనులు



పిచ్చాటూరు రహదారికి ఆనుకుని జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7:శ్రీకాళహస్తిలో కబ్జారాయుళ్ల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది కదా.... అధికారుల సహకారం లేక అక్రమార్కులు సద్దుమణుగుతారని భావించిన పట్టణవాసులకు అది కేవలం ఆశగానే మిగిలింది. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ఎల్ఐసీ కాలనీకి ఆనుకుని సుమారు 20.25 ఎకరాల విస్తీర్ణంలో ఈదులగుంట చెరువు ఉంది. తొట్టంబేడు రెవిన్యూ పరిధిలో ఉన్న ఈ భూమిని శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో విలీనం చేసే ప్రక్రియ తుది దశలో ఉంది. పట్టణం విస్తరించడంతో ఈదులగుంట ప్రాంతంలో భూముల ధరలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. దానికి తోడు మున్సిపాలిటీలో విలీన ప్రతిపాదన కూడా వుండడంతో ఎకరా సుమారు రూ.8 కోట్లకు పైగా పలుకుతోంది. దీంతో 20.25 ఎకరాల చెరువు భూమిని మింగేసేందుకు కొందరు నాయకులు బరితెగించారు.ఇక్కడకు సమీపంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీకి ఎదురుగా మూడేళ్ల క్రితం పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకుడు కబ్జా చేశారు. దీనిపై మూడేళ్ల నుంచి స్థానికులు తిరుగుబాటు చేస్తూనే ఉన్నారు. ఇక్కడకు అత్యంత సమీపంలోనే ఈదులగుంట చెరువు భూమి ఉంది. తాజాగా శనివారం రాత్రి చెరువులో మట్టి వ్యర్థాలను తోలించారు. ఆదివారం యంత్రాలతో కొందరు రంగంలోకి దిగి చెరువులో పట్టపగలు చదును చేసే పనులను చేపట్టారు. ఇది చూసిన స్థానికులు నివ్వెర పోయారు.

రాజీవ్‌నగర్‌లో కబ్జాల జాతర

20 రోజుల నుంచి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్ నగర్‌లో కబ్జాల జాతర సాగుతోంది. ఇటీవల పెద్ద సంఖ్యలో అధికార పార్టీని వీడి టీడీపీలో చేరికలు జరిగాయి. వలసలను అరికట్టేందుకు వైసీపీ నాయకులు రాజీవ్‌నగర్ కాలనీని కేంద్రంగా మార్చుకున్నారు. ఇక్కడ నిరుపేద లబ్ధిదారుల స్థలాలపై కన్నేశారు. అధికారుల అండతో ఖాళీగా ఉన్న సుమారు 1200 ప్లాట్ల జాబితాను సిద్ధం చేసుకున్నారు. వాటిని రహస్యంగా ఎన్నికల్లో అధికార పార్టీకి సహకరించే వారికి సమర్పిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇందుకు అనుగుణంగానే రాజీవ్‌నగర్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచీ అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. రాత్రి సమయాల్లో అయితే ఖాళీ జాగాల్లో యంత్రాలు యుద్ధప్రాతిపదికన తవ్వేస్తున్నాయి. పథకం ప్రకారం రాజీవ్‌నగర్ కాలనీని ఎరగావేసి అధికార పార్టీ నేతలు ఎన్నికలకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

రూ.10కోట్ల ప్రభుత్వ భూమికి చేటు

రాజీవ్‌నగర్ వద్ద పిచ్చాటూరు రహదారికి ఆనుకుని భవిష్యత్తు రోడ్డు విస్తరణ కోసం స్థలాన్ని గతంలో విడిచిపెట్టారు.అయితే ఈ స్థలాన్నీ కబ్జాదారులు చెరబట్టారు. సుమారు 1.2 కిలోమీటర్ల పొడవునా రహదారికి ఆనుకుని అక్రమ కట్టడాలు జోరందుకున్నాయి. అధికారులు, పాలకులతో పాటు కొందరు మీడియా సిబ్బంది ప్రధాన రహదారి పక్కనే ఉన్న భూములను మాయం చేస్తున్నారు. సుమారు రూ. 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని స్వాహా చేస్తున్నారు.

తహసీల్దార్ శివప్రసాద్ ఆస్తులపై దర్యాప్తు ముమ్మరం

విచారణ అధికారిగా సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సీఐ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 : రేణిగుంట మాజీ తహసీల్దార్ శివప్రసాద్ ఆస్తులపై దర్యాప్తు ముమ్మరం చేశారు. విజయవాడలోని ఏసీబీ సీఐ రవీంద్ర దర్యాప్తు అధికారిగా నియమితులయ్యారు. ఇప్పటికే అరెస్టయి నెల్లూరు జైలులో ఉన్న శివప్రసాద్ రూ.70 కోట్ల వరకు అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు రవీంద్ర తిరుపతి, తిరుపతి రూరల్, పాకాల, బంగారుపాళెం, పీలేరు, కడప, రాయచోటి ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్లు, బ్యాంకులకు లేఖలు రాసి వివరాలు సేకరిస్తున్నారు. 10 రోజుల్లో విచారణ పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.28

సహరి (మంగళవారం) : ఉ. 4.44

గంజాయి వ్యాపారులకు అండగా చెవిరెడ్డి కుటుంబం

● 'మీట్ ది గ్రేట్'లో పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుచానూరు, ఏప్రిల్ 7: చంద్రగిరిని చెవిరెడ్డి కుటుంబ అరాచకం నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన 'మీట్ ది గ్రేట్ ' కార్యక్రమానికి పులివర్తి నాని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రవాసాంధ్రులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఐటీ సంస్థల్లో ఎందరో తెలుగు వారు ఉద్యోగాలు చేస్తున్నారంటే అందుకు కారణం చంద్రబాబేనని తెలియజేశారు. కుట్రతో చంద్రబాబును జైలుకు పంపితే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎలా స్పందించారో అందరికీ తెలుసన్నారు. గత ఎన్నికల్లో చెవిరెడ్డి దొంగ ఓట్లతో, కాంట్రాక్టర్ల వద్ద అక్రమంగా వసూళ్లు చేసిన సొమ్ముతో తాయిలాలు పంపిణీ చేసి గెలిచారన్నారు. తుడాను అడ్డుపెట్టుకుని కోట్లు దోచేశారని ఆరోపించారు.నియోజకవర్గంలో ప్రకృతి వనరులను దోచేసి ఇప్పుడు ఒంగోలుకు పోయారన్నారు. గంజాయి వ్యాపారులకు ఆయన కుటుంబ సభ్యులు అండగా ఉంటారని తెలిపారు. యువతను పెడదోవ పట్టిస్తున్న చెవిరెడ్డి కుటుంబానికి బుద్ధి చెప్పాలంటే టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.బోడిపాటి లోకనాథం నాయుడు, ఆదికేశవులునాయుడు, మోహన్, రుక్మందనాయుడు, దాము, శ్రీహరి నాయుడు, గురు, బెంగళూరు బాబు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహమేదీ?

గత పథకాలు తొలగించారు..కొత్త వాటి ఊసే లేదు ● గ్రాసం కొరతతో అల్లాడుతున్న పశువులు

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 7 : పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతులకు ఐదేళ్లగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ అందలేదు. పశు పోషకులకు అందాల్సిన రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా దూరమయ్యాయి. పాల ఉత్పత్తి పెంపుతోపాటు పాడి రైతులకు ఆర్థిక చేయూత అందించేలా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు వైసీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. పశుగ్రాసం కొనలేక, పశువులను పోషించలేక కబేళాలకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఆవులు 8,00,132, గేదెలు 2,74,535, గొర్రెలు 12,62,226, మేకలు 4,68,916 ఉన్నాయి. వీటి కోసం 1,432 ఆర్బీకేలు, 283 సబ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

గత ప్రభుత్వ హయాంలో ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి పెంపునకు ఏటా పశు పోషకులకు పాతర గడ్డి(సైలేజ్), దాణాతోపాటు పలు పథకాలు రాయితీపై అందించారు. ఏటా టన్నుల కొద్ది పాతర గడ్డి బేళ్లను నేరుగా గ్రామాల్లోని పశు పోషకులకు అందజేశారు. 75 శాతం రాయితీపై పాతర గడ్డి కిలో రూ. 2కే సరఫరా చేశారు. దాణా కూడా 75 శాతం రాయితీపై కిలో రూ.4కే సరఫరా చేసే వారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కింద పశువుల సంరక్షణ షెడ్ల నిమిత్తం గోకులం, మినీ గోకులం నిర్మించారు. ఉపాధి హామీ నిధులతో ఊరూరా పశుగ్రాసం విస్తారంగా సాగు చేయించారు. అధిక సంఖ్యలో రైతులు వేసవిలో పశుగ్రాసం కొరత ఉన్న అన్నీ ప్రాంతాలకు పచ్చగడ్డి సరఫరా చేసి ఆదాయం పొందారు. వేసవి సీజన్‌లో పొలాలకు వెళ్లిన పశువులకు తాగునీటి సమస్య లేకుండా అందుబాటులో ఉన్న చేతిపంపుల వద్ద నీటి తొట్టెలు నిర్మించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత..

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గోకులం, మినీ గోకులం పథకాలను రద్దు చేసింది. వాటిని నిర్మించుకున్న పాడి రైతులకు బిల్లులు నిలిపేసింది. అప్పటి వరకు పాడి పరిశ్రమకు సంబంధించి అమల్లో ఉన్న అన్ని పథకాలను ఆపేసింది. గత ప్రభుత్వ హయాంలో రాయితీపై దాణామృతం కిలో రూ.3కే అందిస్తుంటే దాని ధర రూ.6.50లకు పెంచేసింది.



పశుగ్రాసం లేక బక్కచిక్కుతున్న గేదెలు

రాయితీపై పాతర గడ్డి ఇవ్వని కారణంగా పల్లెల్లో పశు పోషకులు వరిగడ్డిపైనే ఆధారపడాల్సి వస్తోంది. వరిగడ్డి ట్రాక్టరు ట్రక్కు ధర రూ.20వేల వరకు పలుకుతోంది. దీంతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఎండాకాలం పాల దిగుబడి తగ్గడంతో ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఐదేళ్లగా పాతర గడ్డి పెంపకానికి ప్రోత్సాహం అందకపోవడం, రాయితీపై దాణా ఇవ్వకపోవడంతో పాడి రైతులు తీవ్రస్థాయిలో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

వైసీపీ కార్యక్రమంలో వలంటీర్



మోహిత్‌రెడ్డి వెంట వలంటీర్ శ్రీకాంత్ (వృత్తంలో)

చంద్రగిరి, ఏప్రిల్ 7: చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీ, మల్లయ్యపల్లెకు చెందిన వలంటీర్ శ్రీకాంత్ వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నాడు.ఆదివారం తుమ్మలగుంటలో జరిగిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.

మహిళలకు టీడీపీలోనే గౌరవం



చంద్రగిరి, ఏప్రిల్ 7: మహిళలకు తెలుగుదేశం పార్టీలోనే సరైన గౌరవం దక్కుతుందని తెలుగు మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ అన్నారు. టీడీపీని ఆదరిస్తే అనేక సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆదివారం చంద్రగిరి పంచాయతీలో మీ ఇంటికి మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుగ్యారెంటీ కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తుందన్నారు. మహిళలకు టీడీపీతోనే భద్రత ఉంటుందన్నారు.టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, టీడీపీ నాయకుడు గౌస్‌బాషా, తెలుగు మహిళలు వడ్లమూడి రాధ, సుశీలమ్మ, సునీత, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరిపంటపై అడవి పందుల దాడి



ఎర్రావారిపాలెం ,ఏప్రిల్ 7 ; వరి పంటలను అడవి పందులు నిత్యం ధ్వంసం చేస్తున్నాయని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లోని రైతులు ఈ రబీ సీజన్‌లో చెరువులు,బోరుబావుల కింద వరి సాగు చేశారు. బియ్యం రేటు పెరగడంతో వరిపై ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. ట్రాక్టర్ దున్నకం రేట్లు, ఎరువుల ధరలు, నాట్లు, కలుపు కూలీ ధరలను తట్టుకొని వందల ఎకరాల్లో సాగు చేశారు. వెన్ను వదులుతున్న దశలో వరి పంటలపై అడవి పందులు రోజూ దాడులు చేస్తున్నాయి. దీంతో అన్నదాతలు భారీగా నష్టపోతున్నారు. రాత్రిళ్లు పొలాల వద్ద కాపలా ఉన్నా ఏదో పక్క పంట తినేసి పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎర్రావారిపాలెం మండలం వీఆర్ అగ్రహారం,కోటకాడపల్లె, చింతగుంట, నెరబైలు, ఉస్తికాయలపెంట, చిన్నగొట్టిగల్లు మండలంలోని దేవరకొండ, చిట్టేచెర్ల, భాకరాపేట గ్రామాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. మామిడి పంట అంతంత మాత్రంగానే వుండడం, అడవిలో నీరు, ఆహారం లేకపోవడంతో అడవి పందులు పంటలపైకి ఎగబడుతున్నాయని రైతులు చెబుతున్నారు. దాడుల నివారణకు ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

జాతీయ పోటీలకు రచనల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7: చిత్తూరు కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జూన్ 12వ తేదీన చిత్తూరులో జాతీయస్థాయి నవలల, కథల సంపుటాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షురాలు డాక్టర్ కె.రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు తమ నవలలు, కథల సంపుటాలను జనవరి 2023 నుంచి డిసెంబరు 2023లోపు ప్రచురితమై ఉండాలని, అలాంటి రచనలు ఈనెల 30వ తేదీలోపు తమ కార్యాలయానికి పంపించాలని సూచించారు. నవల, కథల సంపుటాల పోటీల్లో ఎంపికైన వాటిలో రెండేసి వాటికి రూ.10వేల చొప్పున బహుమతితోపాటు సత్కరిస్తామన్నారు. రచయితలు తమ రచనలను డాక్టర్ కె.రామలక్ష్మి నర్సింగ్ హోం, సుందరయ్య వీధి, చిత్తూరు-517001కు పంపించాలని కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రోజాప్రియ, డాక్టర్ నిరంజన్‌రెడ్డి కోరారు.

ఏనుగుల బెడద నుంచి విముక్తి కల్పిస్తాం

● టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



వేదగిరివారిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

ఐరాల, ఏప్రిల్ 7: ఏనుగుల బెడద నుంచి వేదగిరివారిపల్లె ప్రజలకు విముక్తి కల్పిస్తామని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం వారు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వేదగిరివారిపల్లెలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పక పరిష్కరిస్తామని తెలిపారు. ఇక్కడ నుంచి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ గద్దెనెక్కిన వెంటనే ఈ ప్రాంతం నుంచే అభివృద్ధిని ప్రారంభిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, టీడీపీ నాయకులు సోమశేఖర్ నాయుడు, సందీప్, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, అరుణ్ కుమార్ నాయుడు, చౌదరి నాయుడు, రుష్యేంద్ర నాయుడు, కొల్లా రమేష్, మనోహర్ నాయుడు, ధనంజయ నాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు సహకరించండి

- ఎంపీ అభ్యర్థి కుమారుడు రాధే



కరపత్రాలు అందచేస్తున్న రాధే

కార్వేటినగరం, ఏప్రిల్ 7: వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరమని, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుమారుడు రాధే పిలుపునిచ్చారు. ఆదివారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లిలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాల గురించి మహిళలకు వివరించారు. తన తండ్రి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అమర్, దగ్గుమళ్ల



పలమనేరులో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో అమరనాథరెడ్డి, దగ్గుమళ్ల ప్రసాదరావు

పలమనేరు, ఏప్రిల్ 7: పలమనేరులో ఆదివారం రాత్రి ఏ-1 ఫంక్షన్ హాల్‌లో ముస్లింలతో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ విందులో అమరనాథరెడ్డితో పాటు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, పలమనేరు నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ నాగరాజ, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జనతా సేవామిత్ర సంఘ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 7 : జనతా సేవా మిత్ర సంఘం ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్లో ఆదివారం అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిన్న వయస్సులోనే జనతా సేవా మిత్ర ప్రతినిధులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అవయవ దానం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. డాక్టర్ నాగరాజు అవయవాలను మార్పిడి చేసే విధానంపై అవగాహన కల్పించారు. జనతా సేవా మిత్ర సంఘం వ్యవస్థాపకుడు కిరీటిరెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉండడమే తమ సంఘం లక్ష్యమన్నారు. అంతకుముందు సేవా కార్యక్రమాలకు సంబంధించి అలిపిరి పాదాల మండపం వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు, ఫోన్‌తో పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 : అంతర్ జిల్లా దొంగను తిరుపతి వెస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ.6.44 లక్షల విలువైన 129 గ్రాముల బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి సంజీవయ్యనగర్‌కు చెందిన మహేష్ కొంతకాలంగా సులభ సంపాదనకు అలవాటుపడ్డాడు. తిరుపతి, చిత్తూరులోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద సిబ్బంది అవతారమెత్తాడు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులను, వారి సహాయకులను స్కానింగ్ పేరుతో నమ్మించి, నగలు, విలువైన వస్తువులు అపహరించేవాడు. తిరుపతిలోని స్విమ్స్, రుయా, రమాదేవి ఆస్పత్రుల వద్ద ఇదే తరహా మోసాలు చేశాడు. తిరుపతి పశ్చిమ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ జయనాయక్ దర్యాప్తు చేపట్టారు. రహస్య సమాచారం మేరకు సీఐ జయనాయక్, ఎస్‌ఐ బాలకృష్ణ అతన్ని చెర్లోపల్లి బైపాస్ రోడ్డులోని భారతీయ విద్యాభవన్ వద్ద పట్టుకున్నారు. బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆరోగ్య భద్రతపై అవగాహన అవసరం



ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 7 : ప్రజలకు మంచి వైద్య సేవలు అందించడమేగాక ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నా రు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాతావరణ కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నా ఆరోగ్యం - నా హక్కు అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, డీపీఎంవో శ్రీనివాసులు, డీఐవో శాంతకుమారి పాల్గొన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయాస్పత్రిలో సూపరింటెండెంట్ రవిప్రభు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.


పంట పొలాలపైపడ్డ ఒంటరి ఏనుగు



ఐరాల, ఏప్రిల్ 7: ఐరాల మండలంలోని వేదగిరివారిపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీలో ఆదివారం వేకువజామున ఒంటరి ఏనుగు ఒకటి పంట పొలాలపై పడింది. గ్రామానికి చెందిన పలువురి మామిడి తోటల్లో కొమ్మలు విరిచేసింది. కొబ్బరి తోటలో చెట్లు, వరి పంటను నాశనం చేసింది. అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి అటవీప్రాంతం వద్ద సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సంస్కృతి గొప్పదనాన్ని నేటితరానికి తెలియజెప్పాలి

ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, రచయితలు

గంగవరం, ఏప్రిల్ 7: మన సంస్కృతి, ఆచారాల గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజెప్పేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అన్నారు. గంగవరంలోని కళా మందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు. విదేశాలకు వెళ్లినా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన మనందరిపై ఉందన్నారు. తెలుగువారి పండుగులకు, ప్రకృతికి సంబంధం ఉందని చెప్పారు. అనంతరం తమిళనాడు హోసూరుకు చెందిన అగరం వసంత్ రచించిన 'కథమరిచిన మనిషి', 'తల్లివేరు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు.

పురస్కారాలిలా..

గీతాంజలి స్మారక సాహిత్య పురస్కారాన్ని రమేష్‌నాయుడికి ప్రదానం చేశారు. అలాగే జాతీయ ఉగాది పురస్కారాలను డాక్టర్ భాస్కర్ వేడియం (కుప్పం), గండికోట వారిజ (పలమనేరు), అగరం వసంత, మునిరాజు (హోసూరు), వి.తిరుపతిరావు, రాంబాబు (కేజీఎఫ్), లక్ష్మీకాంతమ్మ (మాలూరు), రామచంద్ర, రాఘవేంద్ర (బెంగళూరు), సుధాకర్ (శ్రీకాళహస్తి), ఉమాదేవి (మదనపల్లె), గుణశేఖరన్ (గంగవరం), భాగ్యలక్ష్మి (కాణిపాకం), పూర్ణిమ (బంగారుపాళ్యం), డాక్టర్ పోలసాయి జ్యోతి (నాగర్కర్నూలు), చిరంజీవి (బైరెడ్డిపల్లి మండలం, కడపనత్తం) బాలసుందరం, దొరస్వామినాయుడు, పార్థసారథి (పలమనేరు)లకు సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప ప్రదానం చేశారు. అలాగే వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన 60 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎస్టీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు, మాధవరెడ్డి, జేటీడీ ధనంజయ, జె.శ్రీరామచంద్రమూర్తి, విమల, ఉమామహేశ్వరరెడ్డి, విజయ్, నవీన్, వివేక్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అక్షర తోరణం సమాపనోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుబ్బానాయుడు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 7: గత ఏడాది ఉగాది నుంచి ఈ ఉగాది వరకు ఇంటర్నెట్‌లో సేవ లైవ్ అక్షర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 11 వరకు మూడు రోజులు 60 గంటలపాటు అంతర్జాతీయ స్థాయిలో జూమ్ వేదికగా ముగింపు సేవ అక్షర తోరణం సమాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సంస్థ(సేవ) వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు తెలిపారు. 180 మందికి పైగా పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9492666660ను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో శోభ, వీఆర్ రాసాని, బీఎన్‌రెడ్డి, బీరం చంద్రారెడ్డి పాల్గొన్నారు.

దేశం నిజంగా వెలిగిపోతోందా?

అంశంపై నేడు సభ

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 7: తిరుపతి యశోదానగర్‌లో ఉన్న వేమన విజ్ఞాన వేదిక ఆవరణలో సోమవారం సాయంత్రం 5 గంటలకు దేశం నిజంగా వెలిగిపోతోందా? సభ జరగనుంది. ప్రధాన వక్తగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ప్రసంగిస్తారు. శాసనమండలి మాజీ ప్రొటెం స్పీకరు విఠపు బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహిస్తారు.

నృత్యం ముగ్ధ మనోహరం



తిరుచానూరు, ఏప్రిల్ 7: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగింది. వేయినామాలవాడ వెంకటేశుడా, అఖిలాండేశ్వరి (భరతనాట్యం), వేడుకుందామా వెంకటేశ్వరుని (భక్తి నృత్యం) వంటి పాటలకు కళాకారులు మస్తాన్, గగన, లహరి, భరత్, అక్షిత, జీవిత, చిత్ర, వర్షిత, మధుశ్రీ, పావని, మమత, సౌరీష్, అనూప్, రేయాన్, మహీధర్, ఈక్షిత్, చందు, నీతు, భానుశ్రీ, దాము, నాగరాజు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి సన్మానించారు.

అంగన్వాడీ ఆశలు వమ్ము

● పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో సీఎం జగన్ విఫలం
● సమ్మెకాలానికీ వేతనం చెల్లించని ప్రభుత్వం

చిత్తూరు, ఏప్రిల్ 7: గత ఎన్నికల ముందు అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను సీఎం జగన్ పూర్తిగా విస్మరించారు. తెలంగాణ కంటే అదనంగా వెయ్యి రూపాయలు జీతం ఇస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని జగన్ ఊరూరా పాదయాత్రలో బాకా ఊదారు. అధికారంలోకి వచ్చాక ఇవన్నీ పక్కన పెట్టేశారు.

వర్కర్‌కు రూ.14,500, ఆయాకు రూ.10వేలను ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంకన్నా వెయ్యి రూపాయల జీతాన్ని అదనంగా ఇస్తామని గత ఎన్నికలకు ముందు చేపట్టిన తన పాదయాత్రలో అంగన్వాడీలకు జగన్ హామీ ఇచ్చారు. పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామనీ చెప్పారు. వైసీపీ అధికారంలోకి రాకముందు వర్కర్లకు రూ.10,500, ఆయాలకు రూ.6వేలు ఉండేది. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.వెయ్యి పెంచారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్సీ పెంచడంతో అక్కడి సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో వర్కర్‌కు రూ.13,500, ఆయాలకు రూ.9వేల చొప్పున చెల్లిస్తున్నారు. కానీ జగన్ ప్రభుత్వం మాత్రం వర్కర్‌కు రూ.11,500, ఆయాకు రూ.7వేలను మాత్రమే ఇస్తోంది. జగన్ ఇచ్చిన హామీ మేరకు వెయ్యి చొప్పున అదనపు వేతనం ఇవ్వాలంటే.. వర్కర్‌కు రూ.14,500, ఆయాకు రూ.10వేలను ఇవ్వాలి. కానీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ఇతర సమస్యలు పట్టని వైనం

అంగన్వాడీ వర్కర్లకు ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చారు. రిటైర్‌మెంట్ వయస్సును 62కు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి, పనిభారాన్ని తగ్గించాలని వర్కర్లు కోరుతున్నారు. వీటిల్లో ఒక్క సమస్యను కూడా పరిష్కరించక పోవడంతో గత ఏడాది డిసెంబరులో 42 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశారు. ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్ల సమ్మెతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించి.. సంఘ నేతలతో చర్చలు జరిపింది. రిటైర్‌మెంటు వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీవో విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు జీవోలను విడుదల చేయలేదు. అలాగే సమ్మెకాలానికి సంబంధించిన 42 రోజుల పూర్తి వేతనాన్ని ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు విడుదల చేయలేదు. సమస్యలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి కమిటీ వేస్తామని చెప్పి.. నాలుగు నెలలవుతున్నా ఆ ఊసే లేదు. జగన్ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీ వర్కర్లు అంటున్నారు.

ప్రభుత్వం దగా చేసింది



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ నిరవధిక సమ్మె చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న మమ్మల్ని వైసీపీ ప్రభుత్వం దగా చేసింది. సమస్యలు పరిష్కరిస్తామని, సమ్మె చేసిన కాలానికి వేతనాన్ని ఇస్తామని చెప్పిన హామీని కూడా ఇంత వరకు నెరవేర్చలేదు. జీవో వచ్చేస్తోంది.. డబ్బులిస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప ఇంత వరకు ఇవ్వనేలేదు.

- సుజని, చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు, అంగన్వాడీ, హెల్పర్స్ యూనియన్

టీడీఆర్ బాండ్లతో తండ్రీకొడుకుల దోపిడీ : టీడీపీ



మాట్లాడుతున్న వట్టికుంట చినబాబు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 7: నగరంలో టీడీఆర్ బాండ్ల రూపంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దోపిడీకి తెరలేపారని టీడీపీ నగర అధ్యక్షుడు వట్టికుంట శంకర్‌నారాయణ(చిన్నబాబు) ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది టీడీపీనేనని గుర్తు చేశారు. ఆధ్యాత్మిక నగరాన్ని అవినీతిలో ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత తండ్రీకొడుకులకే దక్కుతుందని విమర్శించారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా టీడీఆర్ బాండ్ల విషయంలో పెద్దయెత్తున అవినీతి జరిగిందన్నారు. టీడీఆర్ బాండ్లు ఇచ్చిన 342 మంది జాబితాను వెంటనే పంపించాలని ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి ఇచ్చిన ఆదేశాలను అభినయ్‌రెడ్డి బయటకు రాకుండా చేశారని తెలిపారు. నగరంలో అల్లర్లను ప్రేరేపిస్తూ దోపిడీ చేసిన ఆ ఇద్దరూ తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. నాయకులు ప్రశాంత్, కోలా ప్రకాష్, దేవూరి నాగప్రతాప్, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 : తిరుపతి రూరల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మార్ పల్లి ఏఎస్ఐ జోగారావు కథనం మేరకు...నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు వద్ద ఒక వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఉన్నట్లు స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, రుయాకు తరలించారు. దేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో అతను చనిపోయి ఐదారు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు అన్నదానం



పేదలకు పెరుగన్నం అందజేస్తున్న శంకర్‌యాదవ్

తిరుపతి (కొర్లగుంట), ఏప్రిల్ 7 : హెడ్స్(హెల్త్ ఎడ్యుకేషన్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ సొసైటీ) స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం రుయా ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రోగులకు, వారి సహాయకులకు పెరుగన్నం అందజేశారు. ఈ కార్యక్రమంలో వినోద్, కోటేశ్వరరెడ్డి, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

తిరుపతి(కొర్లగుంట), ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్యం దినోత్సవాన్ని పురస్కరించుకుని కొర్లగుంట మెయిన్ రోడ్‌లోని ఓ ప్రైవేటు రెసిడెన్సీలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరుపతి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 300మందికి బీపీ, షుగర్, కంటి, దంత, ఈసీజీ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్దన్, ఆస్పత్రుల అధినేతలు డాక్టర్ ఏ.ఆర్.రెడ్డి, డాక్టర్ దామోదరం, పి.రెడ్డెప్ప, పవన్, డాక్టర్ రంజిత్, విశ్రాంత డీఎస్పీ పిపోతప్ప, విద్యావేత్త గోపాల్ పాల్గొన్నారు.

మెగా హెల్త్ చెకప్‌కు విశేష స్పందన



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్లు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ చెకప్‌కు విశేష స్పందన లభించినట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి, కొత్త జబ్బులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుగా గుర్తించడం ద్వారా చాలా రోగాలను త్వరగా నయం చేయవచ్చునని డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. జనరల్ ఫిజిషన్ డాక్టర్ పీఎస్ నాయుడు, గైనకాలజిస్టు డాక్టర్ ఆర్ సృజన మాట్లాడారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌మునిరి, వైద్యులు పాల్గొన్నారు.

సిద్ధ ఆహార పద్ధతులతో చక్కటి ఆరోగ్యం



సిద్ధ ఆహారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సామ్రాజ్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 7: సిద్ధ ఆహార పద్ధతులతో చక్కటి ఆరోగ్యం పొందవచ్చని సిద్ధ పరిశోధక అధికారి డాక్టర్ సామ్రాజ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్విమ్స్ ఆవరణలోని సిద్ధ రీసెర్చ్ సెంటర్‌లో ఆదివారం సిద్ధ ఆహార నియమాలు, ఆరోగ్య భద్రత సూచనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చక్కటి ఆరోగ్యానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలనే దానిపై వివరించారు. డాక్టర్లు తమిళ సెల్వన్, రాజ్యలక్ష్మి, అరుణాచలం పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని దీక్షలు



దీక్ష చేస్తున్న ఇండియా కూటమి నాయకులు

తిరుపతి(ఆటోనగర్)/తిరుపతి అర్బన్, ఏప్రిల్ 7: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయని ఇండియా కూటమి నాయకులు వెంకటాచలపతి, మాంగాటి గోపాల్‌రెడ్డి, కందారపు మురళి, పి.మురళి డిమాండ్ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్షాలను అణచి వేయడానికి బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుగట్టు నగేష్, వి.నాగరాజు, కె.బాల సుబ్రమణ్యం, రాధాకృష్ణ, టి.సుబ్రమణ్యం, విశ్వనాథ్, జయచంద్ర, విజయభాస్కర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్మరణానందకు ఘన నివాళి



తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 7: శ్రీరామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ ప్రధాన కార్యాలయ 16వ సర్వాధ్యక్షుడు స్మరణానందకు ఘన నివాళి అర్పించారు. ఆదివారం తిరుపతి శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సంస్మరణ సభ నిర్వహించారు. భజనలు, ధ్యానం, సంకీర్తనాగానం చేశారు. స్మరణానంద జీవిత విశేషాల గురించి రామకృష్ణ ఆశ్రమ సంచాలకులు సుకృతానంద ప్రసంగించారు. ఆశ్రమం స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఆచార్య పీవీ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

స్వాధీన నగదు, వస్తువుల విడుదల సులభతరం

- రోజూ ఉదయం 10 గంటలకు గ్రీవెన్స్ కమిటీ హాజరు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల మోడల్ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను సులభంగా విడుదల చేసేందుకు జిల్లాస్థాయిలో ముగ్గురు సభ్యులతో కూడిన గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల తనిఖీలో నమోదైన సీజర్స్ కేసులను కమిటీ సభ్యులు స్వయంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. రోజూ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రూం నెంబరు 306 బిబ్లాక్‌లో నిజనిర్ధారణ చేసి, నగదును, వస్తువులను సంబంధిత వ్యక్తులకు అందజేస్తారని వివరించారు. సాధారణ పౌరులు, వ్యాపారులు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లాల్సి వస్తే అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్లాలని సూచించారు.

సీజర్ అంశాల పరిష్కారం కోసం..

అసిస్టెంట్ ఆడిట్ అధికారి, నోడల్ ఆఫీసర్, ఎక్స్‌పెండిచర్ మానటరింగ్ కన్వీనర్ 9535724755, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి 7993313074, జిల్లా ఖజానా అధికారిని సంప్రదించాలని కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద కుటుంబీకులతో జస్టిస్ మాధవిదేవి

తిరుమల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. జస్టిస్ టి.మాధవిదేవిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 75,414 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 30,073 మంది తలనీలాలు సమర్పించారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి సెంట్రల్, ఏప్రిల్7 : తిరుపతి-కాచిగూడ మధ్య గురు, శుక్రవారాల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను మే రెండో తేదీ వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీఈఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు. రద్దీ దృష్ట్యా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింహ, ముత్యపుపందిరి వాహనాలపై నీలమేఘశ్యాముడు

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 7: కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామి వారు సింహ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. 10 నుంచి 11.30 వరకు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7నుంచి 8.30 వరకు ముత్యపు పందిరి వాహన సేవ జరిగింది. తిరుమల పెద్ద జీయంగారు, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా శ్రీరామచంద్ర పుష్కరిణి వద్ద సాయంత్రం జరిగిన పి.రాగసుధ సంగీత కచేరి ఆహూతులను అలరించింది. గాయనికి వయోలిన్‌పై చంద్రప్రసాద్, మృదంగంపై ఎ.దివాకర్ వాద్య సహకారం అందించారు. సోమవారం కల్పవృక్ష, సర్వభూపాల వాహన సేవలు ఉంటాయి.





సింహ వాహనం - ముత్యపుపందిరి వాహనం

అవినీతి, అరాచకాలతోనే 'అభి'వృద్ధి

- ప్రశాంత తిరుపతే నా లక్ష్యం
- ఎన్టీఏ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్ రెడ్డి అవినీతి, అరాచకాలతో అభివృద్ధి చెందారని జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం మున్సిపల్ పార్కు, దివ్యారామంలో వాకర్స్‌తో కలసి ఆయన నడిచారు. ప్రశాంత తిరుపతి లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. పేరుపేరునా పలకరించి, టీ షాపులో గాజు గ్లాసు చూపిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు. సాయంత్రం అబూబకర్ షాదీమహల్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలసి ప్రార్థనలో పాల్గొన్నారు. అల్లా దయ ఉండాలని ప్రార్థించి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, మెహబూబ్ బాషా, కోడూరు బాలసుబ్రమణ్యం, సూరా సుధాకర్ రెడ్డి, చినబాబు, రవినాయుడు, రుద్రకోటి సదాశివం, సింగంశెట్టి సుబ్బరామయ్య, అహ్మద్ హుస్సేన్, ఖాజీ మొయిద్దీన్, నస్రుద్దీన్, అబ్దుల్‌తో పాటు జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, ఆనంద్, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీ షాపులో గాజు గ్లాస్ చూపిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న కూటమి నేతలు

తిరుమలేశుడి సేవలో సీఎస్ జవహర్‌రెడ్డి



సీఎస్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ ఈవో

తిరుమల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ధ్వజస్తంభానికి మొక్కుకుని గర్భాలయానికి చేరుకున్నారు. అక్కడి మూలవిరాట్టును దర్శించుకున్నారు. తర్వాత రంగనాయక మండపానికి చేరుకోగా వేద పండితులు ఆశీర్వదించారు. శ్రీవారి తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అందజేశారు.

మానవ వికాసానికి సాహిత్యం తోడ్పాటు



తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 7: సాహిత్యం తొలి నుంచి మానవ వికాసానికి కృషి చేస్తోందని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీ క్రోధినామ తెలుగు ఉగాది నేపథ్యంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం (తి.ర.సం) ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్లో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించింది. 40 మంది వివిధ ప్రాంతాల కవులు అంతరించే తెలుగు భాష, లోపిస్తున్న మానవీయ విలువలు, అంటరాని తనం, పేదరికం, ఉగాది వేడుకలు, సంప్రదాయాల రక్షణ వంటి అనేక అంశాలపై తమ కవితలను వినిపించారు. వీరిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తిరసం గౌరవాధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజు, విశిష్ట అతిథి, అధ్యాపకులు డాక్టర్ వి.కృష్ణవేణి పాల్గొన్నారు. కవుల కవిత్వంపై శతావధాని ఆముదల మురళి తన స్పందన తెలిపారు. సభలో నెమిలేటి కిట్టన్న, యువశ్రీమురళి, పురుషోత్తమాచారి, నడ్డినారాయణ, డాక్టర్ మౌని, కడివేటి మునిరత్నం, ఆకుల మల్లేశ్వరరావు, షాజహాన్ శాంతకుమారి, అద్దంకి కోమల, కలువగుంట రామమూర్తి, గోపాల్, బత్తుల రవి, పేరూరు బాలసుబ్రమణ్యం, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 7: తిరుపతికి చెందిన తెలుగు భాషోద్యమ సమితి నిర్వహించిన ఉగాది కథల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదివారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభకు సమితి అధ్యక్షుడు గంగవరపు శ్రీదేవి అధ్యక్షత వహించారు. ప్రథమ బహుమతి గూటికి చేరిన పక్షులు (లక్ష్మీ గాయత్రి), రెండవ బహుమతి సహానుభూతి(డాక్టర్ సుగుణారావు), మూడవ బహుమతి మీరేంటోళ్లు (నీలకంఠ) కథలకు రూ.ఐదు, నాలుగు, మూడువేలు, మరో పది కథలకు రూ.వెయ్యి వంతున ప్రోత్సాహక నగదు బహుమతి అందజేసి, రచయితలను సత్కరించారు. ప్రముఖ రచయిత, ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారతీయ భాషల్లో తెలుగు సాహిత్యం ఎంతో సంపన్నమైందన్నారు. తెలుగు సాహిత్య సంపదను ముందుతరాలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాకం నాగరాజు, తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ ఆర్.వి.సురేష్ కుమార్, షేక్ నసీమ్, శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ సుభద్ర, పేరూరు బాలసుబ్రమణ్యం, ముంగర శంకరరాజు, డాక్టర్ వి.కాంతారావు పాల్గొన్నారు.

అచ్చ తెలుగు పదం అన్నమయ్య



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 7: తన కాలంలో ఉన్న అచ్చ తెలుగు పదాలను విరివిగా వినియోగించి, సంకీర్తన గానం చేసిన వాడు అన్నమయ్య అని శ్రీవేంకటేశ్వర కల్యాణోత్సవం ప్రాజెక్టు అధికారి ఆచార్య చంద్రశేఖర రెడ్డి అన్నారు. అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళా మందిరంలో సాహిత్య సభ నిర్వహించారు. చంద్రశేఖర రెడ్డి అన్నమయ్య - భాషా సౌందర్యం అనే అంశంపై మాట్లాడుతూ ఆనాడు పండితుల భాషగా ఉన్న సంస్కృతాన్ని కాదని సాధారణ జనం మాట్లాడుకునే గ్రామీణ భాషను అన్నమయ్య తన సంకీర్తనలలో విరివిగా వినియోగించారని తెలిపారు. గుంటూరుకు చెందిన విశ్రాంత ఆచార్యులు నాగరాజ్యలక్ష్మి అన్నమయ్య కీర్తనలలో అలంకారాలు, హైదరాబాదుకు చెందిన సాహితీవేత్త శంకరరావు అన్నమయ్య కీర్తనలు - పరిష్కరణ అనే అంశాలపై ప్రసంగించారు. సాయంత్రం విజయవాడకు చెందిన శ్రీనృత్య కళాంజలి వారు ప్రదర్శించిన నృత్యరూపకం ప్రేక్షకులను అలరించింది. అంతకు ముందు అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు బుల్లెమ్మ బృందం సంగీత సభ నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

పానచెరువులో అక్రమ నిర్మాణాలకు బ్రేక్

- మట్టి తోలుతున్న ట్రాక్టర్ సీజ్
- కంచె ఏర్పాటు చేస్తామన్న తహసీల్దారు





దోబీఘాట్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న అర్బన్ తహసీల్దారు ఆదినారాయణ, డీటీ రామచంద్ర - మట్టి తోలుతున్న ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 7: వినాయకసాగర్ సమీపంలోని తిమ్మినాయుడుపాళెం లెక్క దాఖల సర్వే నెంబరు 84లో ఉన్న పానచెరువు దురాక్రమణపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. అర్బన్ తహసీల్దారు ఆదినారాయణ ఆదివారం చెరువును పరిశీలించారు. దోబీఘాట్‌లో జరిగిన నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. చెరువు స్థలానికి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తహసీల్దారు మాట్లాడుతూ పానచెరువును సర్వే చేసి, కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దారు రామచంద్ర, వీఆర్వో వెంకటాచలం, సచివాలయ వీఆర్వో ప్రసాద్, సతీష్ ఆయన వెంట ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అక్రమాలపై ప్రశ్నించినందుకే దాడి
మెప్మా సీఎంఎం సౌజన్య


ఆస్పత్రిలో సీఎంఎం సౌజన్య

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: సూళ్లూరుపేట మెప్మాలో అక్రమాలపై ప్రశ్నించినందుకే తనపై దాడి చేశారని మెప్మా సిటీ మిషన్ మేనేజర్(సీఎంఎం) సౌజన్య మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మెప్మాతో సంబంధం లేని వ్యక్తులు బ్యాంకుకు వెళ్లి నగదు డ్రా చేస్తున్నారని, ఆ విషయాన్ని ప్రశ్నించినందుకే తనపై మెప్మా అధ్యక్షురాలు స్వప్న, ఆమె భర్త దయాకర్, అత్త గుణసుందరి, ఆర్పీలు కలిసి దాడి చేశారని సౌజన్య ఆరోపించారు. పొదుపు సంఘాలకు సంబంధించి నగదును బ్యాంకుల్లో అధికారులకు తెలియకుండా అధ్యక్షురాలు, ఆర్పీలు కలిసి డ్రా చేస్తున్నారని, ఈ విషయం తన దృష్టికి రావడంతో నివారించేందుకు ప్రయత్నం చేశానన్నారు. ఇదే విషయాన్ని మెప్మా పీడీ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. తాను సూళ్లూరుపేటకు వచ్చి ఎనిమిది నెలలు అవుతోందని, మెప్మా ద్వారా గ్రూపులకు అందించే రుణాల్లో అనేక అక్రమాలు జరిగాయని, విచారణ చేస్తే బయటకు వస్తాయన్నారు. కాగా, మెప్మా అధ్యక్షురాలికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకొంటూ అక్కడ పనిచేసే అధికారులపై పెత్తనం చలాయిస్తున్నట్లు విమర్శలున్నాయి. గతంలో కూడా ఇక్కడ పనిచేసిన సీఎంఎంలు ఒత్తిడి తట్టుకోలేక వెళ్లిపోయారు. ఇదే తరహాలో గతంలో కూడా ఒక ఉద్యోగిపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మెప్మాలో రెండేళ్లు పూర్తయిన తరువాత అధ్యక్షురాలిని మార్చాల్సి ఉంది. అయితే నాలుగేళ్లయినా మార్చకుండా కాలయాపన చేస్తుండడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఒక ఉద్యోగిపై కార్యాలయంలో బయట వ్యక్తులు దాడిచేస్తే స్పందించాల్సిన అధికారులు మౌనం దాల్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు సౌజన్యను కొందరు అధికార పార్టీ నేతలు కలిసి రాజీకు దిగ్గే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఉరేసుకుని టైలర్ మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: సూళ్లూరుపేట పట్టణంలోని తపాలా కార్యాలయం వద్ద టైలర్ షాపు నిర్వహిస్తున్న బాలసుబ్రహ్మణ్యం(48) తన షాపులోనే ఉరేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాలసుబ్రహ్మణ్యం సూళ్లూరులో కాపురం ఉంటున్నాడు. శనివారం ఇంటి నుంచి దుకాణానికి వచ్చాడు. రాత్రి షాపులోనే ఉండి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆదివారం ఉదయం 11 గంటలైనా షాపు డోర్ తెరవకపోవడంతో పక్కనే మరో షాపు యజమాని చూడగా బాలసుబ్రహ్మణ్యం ఉరేసుకొని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చర్చి దగ్ధం

చిట్టమూరు, ఏప్రిల్ 7: మండల పరిధిలోని మన్నెమాల గ్రామంలో ఉన్న చర్చి షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. గ్రామంలో కొందరు క్రిష్టియన్లు పూరింటిని చర్చిగా మార్చుకున్నారు. ఆదివారం ప్రార్థనలు చేసుకొంటుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కుర్చీలు, మైక్‌సెట్, స్పీకర్ బాక్స్‌లు, టేబుళ్లు, ఇతర పరికరాలు కాలిపోయాయి. తహసీల్దార్ శ్రీనివాస శర్మ ఆదేశాల మేరకు వీఆర్వో వెంకటేశ్వర్లు చర్చిని పరిశీలించి నివేదిక అందజేశారు. సుమారు 1.50లక్షల నష్టం జరిగినట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు.


పూడి రాయదొరువు ముఖద్వారం వద్ద ఇసుక మేటలు - నీళ్లు లేక నెర్రెలు బారిన పులికాట్

నాడు కళకళ... నేడు వెలవెల

- నీళ్లు లేక నెర్రెలు బారిన పులికాట్ సరస్సు
- ముఖద్వారాల పూడికతీత కలేనా?

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: ఒకప్పుడు ఏడాది పొడవునా నిండుకుండను తలపించే పులికాట్ సరస్సు నేడు నీళ్ల లేక నెర్రెలు బారి ఎడారిని తలపిస్తోంది. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులో 620 చదరపు కిలో మీటర్లలో విస్తరించిన పులికాట్ పూర్వవైభవం కోల్పోయింది. ఆసియాలోని ఉప్పునీటి సరస్సుల్లో రెండో అతి పెద్దది పులికాట్. అపార మత్స్య సంపదకు నిలయంగా పేరగాంచిన ఈ సరస్సుపై ఆధారపడి దాదాపు 20వేల మందికి పైగా జీవనం సాగిస్తున్నారు. జిల్లాలోని తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, వాకాడు, చిట్టమూరు మండలాలు, తమిళనాడు రాష్ట్రంలోని గుమ్మడిపూడి, ఆరంబాకం, ఏలావూరు ప్రాంతాల్లో వరకు సరస్సు విస్తరించి ఉంది. సముద్రపు నుంచి ఉప్పునీరు, స్వర్ణముఖి, కాళంగి నదులు, పాముల కాలువ, కరిపేటి కాలువ నుంచి మంచినీరు పులికాట్‌లో కలవడంతో సరస్సులో దొరికే చేపలు, రొయ్యలు, పీతలు రుచికరంగా ఉంటాయి. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన పులికాట్ పూర్వవైభవం కోల్పోయి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత టీడీపీ హయాంలో సరస్సు అభివృద్ధికి రూ.48 కోట్లు కేటాయించి సర్వే సైతం చేశారు. ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఆగిపోయాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు పులికాట్ సరస్సు పూడిక తీత పనులు చేస్తామని పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్లు ఆ ఊసేఎత్తని జగన్ ఎన్నికల దగ్గరపడుతున్న తరుణంలో గతేడాది నవంబరులో ముఖద్వారాల పూడికతీతకు రూ.122 కోట్లతో శంకుస్థాపన చేస్తామని హడావిడి చేశారు. ఈ హడావిడి పనులకు వరుణుడు సైతం కరుణించకపోవడంతో వాయిదా పడింది. పర్యాటకంగా ఎంతో పేరొందిన పులికాట్ సరస్సు గురించి ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పట్టించుకొన్న పాపాన పోలేదు. ఒకప్పుడు నాలుగు మీటర్ల లోతు ఉండే సరస్సు నేడు మీటరు లోతు కూడా లేదు. సముద్రం నుంచి నీరొచ్చే ముఖద్వారాలు పూడిపోవడంతో సముద్రపు నీరు పులికాట్‌కు రావడం లేదు. కేవలం వర్షాకాలంలో మూడు మాసాల మాత్రమే పులికాట్ జలకళతో ఉంటుంది. మిగిలిన కాలమంతా ఎడారిని తలిపిస్తోంది. ఏటా మత్స్య సంపద కూడా తగ్గిపోతుండడంతో జాలర్లు వేటలేక వలసబాట పడుతున్నారు. పక్కనే ఉన్న తమిళనాడులో పళ్లవర్‌కాడులో ఉన్న ముఖద్వారం వద్ద ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏటా పూడిక తీస్తోంది. దీంతో తమిళనాడు ప్రాంతంలో మత్స్య సంపద విరివిగా దొరుకుతోంది. మళ్లీ ఎన్నికలు రావడంతో శనివారం నాయుడుపేటలో జరిగిన ప్రజాగళంలో చంద్రబాబు పులికాట్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి సరిహద్దు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మళ్లీ మత్స్యకారుల్లో ఆశలు చిగిరించాయి.

అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి: పాశిం


ఏకసిరి గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న సునీల్‌కుమార్

చిట్టమూరు, ఏప్రిల్ 7: ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఏకసిరి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో హత్యలు, దౌర్జన్యాలు, దోపిడీ పాలన సాగుతోందన్నారు. దోచుకుంటున్నారే తప్ప రాష్ట్ర అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడేలేడని విమర్శించారు. టీడీపీ పాలనలో ఏకసిరి గ్రామంలో రూ.9.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అదేవిధంగా రూ.74.80 కోట్లతో 16 సిమెంటు రోడ్లు వేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పిడికెడు మట్టి వేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు పరిచే సూపర్ సిక్స్ పథకాల గురించి తెలియజేస్తూ కరపత్రాలు అందజేశారు. ఏకసిరి గ్రామస్తులు సునీల్‌కుమార్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు అబ్బయ్యనాయుడు, బసివరెడ్డి హరికృష్ణారెడ్డి, గుంపర్ల చిన్నారావు, శ్రీనివాసుల నాయుడు, అనురాధ, టీడీపీ సీనియర్ నాయకులు మస్తాన్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, సునీల్‌రెడ్డి, మాజీ జట్పీటీసీ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి: నెలవల


టీడీపీలో చేరిన యువకులతో నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 7: టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం పెళ్లకూరు మండలం చెన్నప్పనాయుడుపేట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీ నేత వేలూరు హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. వారికి నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాదయాత్ర సమయంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు కావాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నంచి కృష్ణయ్య, రవి, గంగయ్య, హరి, అనిల్, ప్రవీణ్, తేజ, చిరంజీవి, శేఖర్, యువరాజ్, గురవయ్య, అశోక్‌కుమార్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: పట్టణంలోని ఫ్లైఓవర్ వద్దనున్న రైస్‌మిల్లులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు, కోళ్లమిట్ట, బాపూజీ వీధి, ఇందిరానగర్, కోళ్లమిట్ట తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో యువత టీడీపీలో చేరారు. వారికి నెలవల సుబ్రహ్మణ్యం, వేనాటి సతీష్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

తడ, ఏప్రిల్ 7: టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే రూ.4వేల పింఛన్ ఇంటి వద్దకే పంపుతారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం మాంబట్టులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి ఎన్ఎం కండ్రిగ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛను ఇంటి వద్దకు పంపకుండా వైసీపీ ప్రభుత్వం డ్రామాలు ఆడి పేదలను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ప్రజా సమస్యల పట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోగా పులికాట్ పూడికతీత పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, మురళీరెడ్డి, చిల్లకూరు సురేష్‌రెడ్డి, బొమ్మన పళణి, వేనాటి రాజారెడ్డి, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పాలనను నిర్వీర్యం చేసిన వైసీపీ: విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: గ్రామాల్లో పాలనను నిర్వీర్యం చేసిన పాపం వైసీపీదేనని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంగానెల్లూరు, సుగ్గుపల్లి గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబుతోనే గ్రామాల్లో సుపరిపాలన జరుగుతుందని, జగన్ పాలనలో పంచాయతీ నిధులను సైతం పక్కదారి పట్టించి నిర్వీర్యం చేశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, గాడి నారాయణ రెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, తాటిపర్తి శ్రీనివాసుల రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బెడద నుంచి విముక్తి కల్పిస్తాం

- టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు


వేదగిరివారిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

ఐరాల, ఏప్రిల్ 7: ఏనుగుల బెడద నుంచి వేదగిరివారిపల్లె ప్రజలకు విముక్తి కల్పిస్తామని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం వారు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వేదగిరివారిపల్లెలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పక పరిష్కరిస్తామని తెలిపారు. ఇక్కడ నుంచి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ గద్దెనెక్కిన వెంటనే ఈ ప్రాంతం నుంచే అభివృద్ధిని ప్రారంభిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, టీడీపీ నాయకులు సోమశేఖర్ నాయుడు, సందీప్, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, అరుణ్ కుమార్ నాయుడు, చౌదరి నాయుడు, రుష్యేంద్ర నాయుడు, కొల్లా రమేష్, మనోహర్ నాయుడు, ధనంజయ నాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు సహకరించండి
- ఎంపీ అభ్యర్థి కుమారుడు రాధే


కరపత్రాలు అందచేస్తున్న రాధే

కార్వేటినగరం, ఏప్రిల్ 7: వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరమని, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుమారుడు రాధే పిలుపునిచ్చారు. ఆదివారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లిలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాల గురించి మహిళలకు వివరించారు. తన తండ్రి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అమర్, దగ్గుమళ్ల


పలమనేరులోని ఏ-1 ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో అమరనాథరెడ్డి, దగ్గుమళ్ల ప్రసాదరావు

పలమనేరు, ఏప్రిల్ 7: పలమనేరులో ఆదివారం రాత్రి ఏ-1 ఫంక్షన్ హాల్‌లో ముస్లింలతో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ విందులో అమరనాథరెడ్డితో పాటు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, పలమనేరు నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ నాగరాజ, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో
అదుపులోకి రాని మంటలు
పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: సూళ్లూరుపేట పట్టణంలోని హోలీక్రాస్ కూడలి సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న డంపింగ్ యార్డులో రెండు రోజులైనా మంటలు అదుపులోకి రాలేదు. ఆదివారం కూడా మంటలు కొనసాగడంతో పట్టణంతో పాటు వట్రపాలెం, జాతీయ రహదారి నుంచి మన్నారుపోలూరు వరకు దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకూ అవస్థలు తప్పలేదు. డంపింగ్ యార్డులో చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. స్థానిక అగ్నిమాపక సిబ్బందితో పాటు, షార్, హైవే అధికారులు అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా ఆదివారం సాయంత్రం వరకు అదుపులోకి రాలేదు. దుర్వాసన కూడిన పొగ వెలువడుతుండడంతో పట్టణమంతా కాలుష్య కోరల్లో చిక్కుకొంది. తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో డంపింగ్ యార్డు పక్కనే పంటపొలాలు, కాళంగి నది నీరంతా కలుషితమైపోతోంది. పొగకమ్మేసి ప్రజలతో పాటు జాతీయ రహదారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినా మున్సిపాలిటీ అధికారుల్లో చలనం లేకపోవడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సుపరిపాలన కోసం టీడీపీని గెలిపించండి

గూడూరు, ఏప్రిల్ 7: రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందాలంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఐసీఎస్‌రోడ్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసరాల వస్తువుల ధరలను, విద్యుత్ చార్జీలను పెంచివేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యం చెందిందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రజాకూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, పేటేటి వెంకటేశ్వర్లు, రవీంద్రరెడ్డి, నరసింహులు, శివకుమార్, సునీల్, సందీప్, పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆత్మీయ సదస్సులో వీవోఏలు

కోట, ఏప్రిల్ 7: మండల పరిధిలోని విద్యానగర్‌లో ఆదివారం రాత్రి వైసీపీ యువ ఆత్మీయ సదస్సు జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, యువజన విభాగం నాయకుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, వైసీపీ సీఈసీ సభ్యుడు కోడవలూరు ధనంజయరెడ్డి, గూడూరు పరిశీలకులు ఎంఆర్‌సీరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేసే పలువురు వీవోఏలు హాజరయ్యారు. విలేకర్లు అప్రమత్తమై ఫొటోలు తీసేందుకు ప్రయత్నించగా పలాయనం చిత్తగించారు.

రేకుల ఇల్లు దగ్ధం

బాలాయపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని అంబలపూడి గ్రామంలో ప్రమాదవశాత్తు రేకుల ఇళ్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.... సారమ్మకు చెందిన రేకుల ఇంటికి చుట్టు తాటాకులతో దడి ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. సారమ్మ దంపతులు పనుల నిమిత్తం బయట వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దడితో పాటు ఇంట్లోని సామగ్రి కాలిపోయింది.

పుత్తూరు వార్తలు

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: ఆదిమూలం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 7: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని హరి ఫంక్షన్ హాల్‌లో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదిమూలం మాట్లాడుతూ సీఎం జగన్ నా ఎస్సీలు, నా బీసీలు అంటూనే నిలవునా ముంచారని ధ్వజమెత్తారు. వైసీపీ అధికారంలోకి రాగానే అంతకుముందు ఉన్న బీసీ కార్పొరేషన్ల రద్దు చేశారని గుర్తుచేశారు. మంత్రి పెద్దిరెడ్డి ఎన్నికల ప్రచారం కోసం వచ్చి ఎస్సీలు, బీసీల, ఎస్టీల మధ్య చిచ్చు పెడుతున్నారని, ప్రజలు వాటిని నమ్మవద్దని కోరారు. మీలో ఒకడిగా, మీతో పాటు ఉంటూ సేవలందించడానికి తనను ఆశీర్వదించాలని ఆదిమూలం కోరారు. మాజీ ఎంపీపీ, సెంగుందర్ మొదలియార్ కుల సంఘం నాయకుడు భక్తవత్సలం ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అలాగే విశ్రాంత డాక్టర్ సుబ్రహ్మణ్యం, బొప్పరాజపాలెం మాజీ ఎంపీటీసీ దామోదరం, వెల్తూరు కండ్రిగ, ఎరికంబట్టులో యువత, నైనారుకండ్రిగలో సుబ్రహ్మణ్యం రెడ్డి ఆధ్వర్యంలో పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సదాశివం, ఆర్‌డీ ఏకాంబరం, భాస్కరన్, కే.శివకుమార్, పరుశురామయ్య, టి.సుబ్రహ్మణ్యం, మాణిక్యం రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాలరాజు, వాసుదేవయ్య, హరిశెట్టి, దొరవేలురెడ్డి, గోవిందశెట్టి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7: అంతర్ జిల్లా దొంగను తిరుపతి వెస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ.6.44 లక్షల విలువైన 129 గ్రాముల బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి సంజీవయ్యనగర్‌కు చెందిన మహేష్ ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల వద్ద సిబ్బంది అవతారమెత్తాడు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులను, వారి సహాయకులను స్కానింగ్ పేరుతో నమ్మించి, నగలు, విలువైన వస్తువులు అపహరించేవాడు. తిరుపతిలోని స్విమ్స్, రుయా, రమాదేవి ఆస్పత్రుల వద్ద ఇదే తరహా మోసాలు చేశాడు. ఆదివారం తిరుపతిలో మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

వడమాలపేట, ఏప్రిల్ 7: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో పూర్వవైభవం వస్తుందని ఆ పార్టీ నగరి నియోజకవర్గ అభ్యర్థి రాకేష్ రెడ్డి చెప్పారు. ఆదివారం వడమాలపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో స్థిరమైన పాలన కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్, నాయకులు పురుషత్తం రెడ్డి, హరిహరిరావ్, శంకర్‌రాజు, జగదీష్, రవి, మునికృష్ణయ్య, రాజా, కుమార్, వెంకటేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు ప్రాధాన్యం

వడమాలపేట, ఏప్రిల్ 7: టీడీపీలోనే బీసీలకు తగిన ప్రాధాన్యం లభిస్తుందని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి దాము యాదవ్ చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నేతలు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతోనే వెనుకబడిన వర్గాలకు అన్ని రంగాల్లో అవకాశం వచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వెనుకబడిన అన్ని వర్గాల ప్రజలందరూ మోసపోయారని, ఇకనైన మేల్కొని టీడీపీకి అండగా నిలవాలని కోరారు. బీసీలకు అణగదొక్కే ప్రయత్నం చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో నాయకులు సుబ్రమణ్యం యాదవ్, జానా వెంకటయ్య, లక్ష్మీప్రసన్న, శేషాద్రి యాదవ్, శోభనాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

భానుప్రకాష్‌కే మా మద్దతు
చెన్నైలో ఆత్మీయ సమావేశంలో ప్రవాసాంధ్రుల ప్రకటన


గజమాలతో గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

విజయపురం, ఏప్రిల్ 7: చెన్నైలో నిర్వహించిన ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమావేశంలో నగరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు ప్రవాసాంధ్రులు పూర్తి మద్దతు తెలిపారు. ఆదివారం చెన్నై అన్నానగర్‌లోని టవర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నగరి నియోజకవర్గానికి చెందిన తమిళనాడులో నివాసముంటున్న ప్రవాసాంధ్రులు పాల్గొని భానుప్రకాష్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. భానుప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని, రాష్ట్రాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, ప్రవాసాంధ్రులు రావిళ్ల బాలాజీ, బాలకృష్ణ, బాబు, ఓంకార్, సుబ్రహ్మణ్యంరాజు, శేఖర్‌రాజు, శివకుమార్, మధు నాయుడు, లోకేష్ రాజు, సుధాకర్‌రాజు, నగరి నియోజకవర్గ ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటేయండి: టీడీపీ


ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు

నగరి, ఏప్రిల్ 7: నగరి మండల పరిధిలోని తెరణి, మూలనత్తం, చిన్నతాంగాళ్ గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర మహిళా అధికారప్రతినిధి మీరా, బాలాజీ, పరంధామ నాయుడు, బాలసురేష్ నాయుడు, వరదరాజులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైఎస్సార్ పార్టీ కాదు పీఎల్ఆర్ పార్టీ: ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 7: ఉమ్మడి జిల్లాలో వైస్సార్ పార్టీ పీఎల్ఆర్ పార్టీగా మారిపోయిందని ఇక్కడ ఆ పార్టీకి అధినేత జగన్ కాదు మంత్రి పెద్దిరెడ్డి అని సత్యవేడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం విమర్శించారు. సత్యవేడులోని బేరిశెట్టి కళ్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జయహో బీసీ, పార్టీ మండల స్థాయి సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిమూలం మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో ఉన్న ఇసుక, గ్రావెల్, మైనింగ్ తదితర అపారమైన సహజ వనరులను దోచుకునేందుకే మంత్రి పెద్దిరెడ్డికి సత్యవేడుపై ఇంత ప్రేమ ఉందని ఆరోపించారు. ఆయన దోపిడీని ఎవరూ ప్రశ్నించకుండా ఉండాలని ఆ పార్టీలో స్థానికులకు అభ్యర్థిగా అవకాశం ఇవ్వకుండా ఎక్కడినుంచో ఒక బొమ్మను తీసుకొచ్చి ఇక్కడ తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు. 14 సంవత్సరాలు పార్టీ కోసం కష్టపడ్డ తనను వైసీపీ పెద్దలు అవమానకరంగా సాగనంపితే, చంద్రబాబు అక్కున చేర్చుకున్నారని తెలిపారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో 13 మంది సీఎంలను చూశానన్నారు. కానీ ఇంతటి ఘోరమైన పరిపాలనను తానెప్పుడూ చూడలేదన్నారు. గ్రామాల్లో స్థానిక నాయకులు పెట్టిన అక్రమ కేసులన్నీ తానే పెట్టానని వైసీపీ దుష్ప్రచారం చేస్తూ తన గెలుపును అడ్డుకునే కుటిల ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేశాయి. ఈ కార్యక్రమంలో నాయకులు సుందర రామిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, పరమశివం, నాగరాజు యాదవ్, పరంధామయ్య నాయుడు, జనసేన నాయకులు లావణ్యకుమార్, రూపేష్ కుమార్, హేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఆదిమూలం పరామర్శ



సుదర్శనమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 7: మండలంలోని కాంపాళెం గ్రామానికి చెందిన సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేడాం వెంకటాచలం కుటుంబాన్ని ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం పరామర్శించారు. వెంకటాచలం తల్లి సుదర్శనమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో ఆదివారం వెంకటాచలం తల్లి కర్మక్రియలకు హాజరై ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచాలమ్మ, నాయకులు మునిరాజ, సత్య నారాయణ, వెంకటేశు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి



కేవీబీపురం, ఏప్రిల్ 7: మండలంలోని రైతులు ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు కష్టాల్లో కూరుకుపోతున్నారు. ప్రస్తుతానికి మండలంలో ఎక్కువశాతం షుగర్‌లెస్ ధాన్యాన్ని పండించారు. దిగుబడి ఆశించనంతగా వచ్చింది. అయితే కనీస ధర లేక నష్ట పోయే పరిస్థితి ఉంది. 80 కేజీల ధాన్యం రూ.1,930 మాత్రమే పలుకుతోంది. కనీసం రూ.2,500 అయినా ధర ఉంటే రైతు నష్టపోకుండా ఉంటాడని ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతన్నారు.

ఈ శిలా ఫలకానికి కోడ్ వర్తించదా..!



తొట్టంబేడు, ఏప్రిల్ 7: మండలంలోని దిగువకొణతనేరి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణం పూర్తికాకుండానే శిలాఫలకం ఏర్పాటు చేశారు. గత నెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ఈ శిలాఫలకానికి మాత్రం ముసుగు వేయలేదు. కోడ్ ఈ శిలా ఫలకానికి వర్తించదా అని జనం ప్రశ్నిస్తున్నారు.

స.హ.చట్టం న్యాయపోరాట సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వర్‌రాజు



ఏర్పేడు, ఏప్రిల్ 7: సమాచార హక్కు చట్ట న్యాయపోరాట సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రాజులకండ్రిగకు చెందిన కే.ఈశ్వర్‌రాజు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు కంచర్ల సురేష్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు.

బావిలో పడి తాపీ మేస్త్రి మృతి

సత్యవేడు, ఏప్రిల్ 7: సత్యవేడులోని నాగాలమ్మ ఆలయానికి సమీపంలోని బావిలో పడి సత్యవేడుకు చెందిన తాపీ మేస్త్రి ఏలుమలై(44) మృతి చెందాడు. ఎస్ఐ వీరాంజనేయులు కథనం మేరకు... సత్యవేడు గంగమిట్ట వీధిలో ఏలుమలై కుటుంబం నివసిస్తుంది. ఏలుమలై తాపీ మేస్త్రి. ఈ నేపథ్యంలో బావిలో శవమై తేలాడు. స్థానికులు గుర్తించి శనివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వీరాంజనేయులు తమ సిబ్బందితో మృతదేహాన్ని వెలికితీయించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం



తొట్టంబేడు, ఏప్రిల్ 7: మండలంలోని రాంబట్లపల్లి గ్రామానికి చెందిన వెంకటరత్నం, ఈశ్వర్‌లకు చెందిన గడ్డివామికి ఆదివారం నిప్పు అంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్రామస్తుల సాయంతో మంటలు అదుపుచేశారు. అప్పటికే లక్ష విలువైన గడ్డి కాలిపోయిందని బాధితులు వాపోయారు.

మహిళ అదృశ్యం... కేసు నమోదు

ఏర్పేడు, ఏప్రిల్ 7: మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏర్పేడు మండలం కమ్మరిమిట్ట గ్రామానికి చెందిన వెంకటమునిరెడ్డి, ఈశ్వరమ్మ దంపతుల కుమార్తె శారద. ఈమెను రేణిగుంట మండలం వినాయక నగర్‌కు చెంగారెడ్డికి ఇచ్చి రెండేళ్లక్రితం వివాహం చేశారు. ఆరు నెలలుగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు నెలకొన్నాయి. పదిరోజుల క్రితం శారద ఇంటి నుంచి వెళ్లిపోయింది. పుట్టింటికి చేరుకోలేదు. దీంతో భర్తతో పాటు పుట్టింటి వారు ఆమె కోసం బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలన్న పాలనతో శ్రీకాళహస్తికి పూర్వ వైభవం



ప్రచారం నిర్వహిస్తున్న సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7: గోపాలన్న పాలనతో శ్రీకాళహస్తికి పూర్వ వైభవం తీసుకొస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలోని 7, 8, 9 వార్డుల్లో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని దీక్షలు

తిరుపతి(ఆటోనగర్)/తిరుపతి అర్బన్, ఏప్రిల్ 7: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని ఇండియా కూటమి నాయకులు వెంకటాచలపతి, మాంగాటి గోపాల్‌రెడ్డి, కందారపు మురళి, పి.మురళి డిమాండ్ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్షాలను అణచి వేయడానికి బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 75,414 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 30,073 మంది తలనీలాలు సమర్పించారు.

వలంటీర్ల తొలగింపు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 7: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో అనసూయ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని చిన్న పాండూరు పంచాయతీలో శుక్రవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ప్రచారం చేశారు. ఆ పంచాయతీకి చెందిన వలంటీర్లు భూపతి, శోభ ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో వారిని విధుల నుంచి తొలగించారు.

మద్యం స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

ఏర్పేడు, ఏప్రిల్ 7: ఏర్పేడు మండలం కొత్తవీరాపురం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న మునెయ్య అనే వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతడి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలం ఇసుకగుంటలో ఇంటి వద్దే ఆదివారం అక్రమంగా మద్యం అమ్ముతున్న శ్రీనివాసులు(40)ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని పూజిత జూనియర్ కళాశాల ఆవరణంలో డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో శంకర నేత్రాలయ ఆస్పత్రి మిషన్ ఫర్ విజన్ ట్రస్టువారు ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 65 మందికి వైద్యులు అరవింద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. యోగా గురువు సురేష్‌నాయుడు, డైనమిక్ ఫౌండేషన్ ప్రతినిధులు నాగప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాస్, తేజ, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

సత్యవేడు, ఏప్రిల్ 7: ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక వీఎంకే కల్యాణ మండపంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలాన్ని గెలిపించే బాధ్యత ప్రతి కార్యకర్తా తీసుకోవాలన్నారు. ఎవరూ బేషజాలకు పోకుండా ఐక్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం ఉమ్మడి ఎమ్మెల్యే ఆదిమూలాన్ని నాయకులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శులు వరప్రసాద్, తన్ జమోహన్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణ, మండల అధ్యక్షులు ప్రతాప్, పురుషోత్తం, హరిబాబురెడ్డి, మునిశేఖర్, కుమరేషన్, ఆనంద్, విజయన్ పాల్గొన్నారు.

మామండూరులో ఏనుగుల సంచారం



ఏనుగు విరిచేసిన మామిడి చెట్టును చూపుతున్నరైతు కుమార్

రేణిగుంట, ఏప్రిల్ 7: ఆహారం కోసం మామండూరులో ఏనుగుల సంచారం రోజురోజుకూ అధికమవుతోంది. శనివారం మామిడి తోటల ధ్వంసంపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు స్పందించలేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వేకువ జామున ఏనుగుల గుంపు మళ్లీ మామిడి తోటల్లో సంచరించింది. మామిడి కాయలు తిని చెట్లను విరిచేశాయి. మామిడి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

పెద్దవాగు కబ్జా..!

● ఆక్రమణను అడ్డుకున్న వీఆర్వో బదిలీ



ఇసుకగుంట వాగును మట్టితో పూడ్చివేసిన దృశ్యం

రేణిగుంట, ఏప్రిల్ 7: రేణిగుంట మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూములు, వంక పోరంబోకులు, కాలువల ఆక్రమణలు ఆగడం లేదు. ఈ క్రమంలో ఓ వాగు ఆక్రమణను అడ్డు కున్న వీఆర్‌వోను వైసీపీ నేత ఒకరు ఏకంగా బదిలీ చేయించారు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెదళ్లచెరువు గ్రామ పరిధిలో రేణిగుంట- శ్రీకాళహస్తి ప్రధాన రహదారిని ఆనుకుని ఇసుకగుంట వాగు ఉంది. మల్లిమడుగు డ్యాం నిండినపుడు గేట్లు ఎత్తిన సమయంలో ఈ ఇసుకగుంట వాగు నుంచి స్వర్ణముఖి నదిలోకి నీరు ప్రవహిస్తుంది. ఇక్కడ రేణిగుంట- నాయుడుపేట ఆరులేన్ల జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. దీంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో అక్రమార్కుల కన్ను వాగుపై పడింది. వాగులో దాదాపు అర ఎకరా మట్టి పోసి కబ్జా చేశారు. స్థానిక వీఆర్వో రెండు నెలల క్రితం అక్రమార్కులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో వైసీపీ నేత ఒత్తిడితో రెవెన్యూ అధికారులు వీఆర్‌వోను మరోచోటుకి బదిలీ చేశారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు స్థానిక తహసీల్దారుతో పాటు ప్రస్తుత వీఆర్వోను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా స్పందించకపోవడం గమనార్హం.

టీడీపీలోకి జోరందుకున్న వలసలు



సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

రేణిగుంట, ఏప్రిల్ 7: టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఆదివారం కరకంబాడి పంచాయతీ రాజునగర్‌కుచెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు 6వ క్లస్టర్ టీడీపీ నాయ కుడు బుజ్జినాయుడు ఆధ్వర్యంలో ఊరందూరులో బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువాలు ధరించారు. పార్టీలో చేరిన వారిలో రవి, సుభాష్, వెంకటేష్, సుబ్ర హ్మణ్యం, వెంకటేష్, మునస్వామి, నరసింహులు, మణి, పవన్, చంద్రయ్య, వెంకటేష్, వెంకటకృష్ణ, బాలాజీ, లోకేష్, బత్తెయ్య, అశోక్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు భరించలేక టీడీపీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాడి రాజేంద్ర, మునిరాజ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి చేరిక..

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలంలోని వాంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కుమార్‌నాయుడు టీడీపీలో చేరారు. ఇలగనూరు గ్రామంలో టీడీపీ ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఆయనకు సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్ యాదవ్, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, చెంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాథంనాయుడు, పాపిరెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా గజపూజ మహోత్సవం



పిచ్చాటూరు, ఏప్రిల్ 7: పిచ్చాటూరు ధర్మరాజు ఆలయంలో చిన్నారుల పండరి భజన, గజపూజ మహోత్సవం శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు భక్తి ప్రపత్తులతో, కోలాహలంగా సాగింది. 14 ఏళ్ల లోపు చిన్నారులు రెండు నెలలుగా పండరి భజన శిక్షణ తీసుకున్నారు. ఈ శిక్షణ శనివారం రాత్రి ముగియడంతో గజపూజ చేశారు. అందులో భాగంగా పాండురంగ స్వామి దంపతుల చిత్రపటాన్ని ఆలయం ఎదుట ఉంచి గజమాల, శ్రీవారి గొడుగులతో ముస్తాబు చేశారు. తర్వాత చిన్నారులు భజనలు వేశారు. తర్వాత పాండురంగ స్వామి దంపతుల కల్యాణం కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా టీటీడీకి చెందిన కళా బృందం అన్నమయ్య కీర్తనలు, పాండు రంగని కీర్తనలు ఆలపించారు. పలువురు దాతలను నిర్వాహకులు శాలువాలు కప్పి సన్మానించారు. చివరగా చిన్నారులకు పండరి భజన నేర్పిన గురువులు లోకేష్, శివకుమార్, తులసి, శ్రీవాణిలను ఘనంగా సత్కరించారు.

రేణిగుంటలో యథేచ్ఛగా కొళాయి కనెక్షన్లు

● ఒక కనెక్షన్‌కు మరో కనెక్షన్ ఉచితం

రేణిగుంట, ఏప్రిల్ 7: రేణిగుంట మేజర్ పంచాయతీలో యథేచ్ఛగా కొత్త కొళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. ఒక కనెక్షన్‌కు మరో కనెక్షన్ ఉచితంగా ఇస్తూ గుట్టుచప్పుడు కాకుండా పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. వేసవికాలంలో నీటి సమస్యలు తలెత్తడం సహజం. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు వేసవిలో కొత్త నీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వకూడదు అనేది పంచాయతీ నిబంధన. మరోపక్క ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కొత్త కొళాయి కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న వారికి డీఎల్‌పీవో అనుమతి ఇస్తేనే పరిశీలించి నీటి వాడకం ఆధారంగా అనుమతులు ఇస్తారు. అయితే రేణిగుంట పంచాయతీలో ఈ నిబంధనలు పక్కన పెట్టి యథేచ్ఛగా కొళాయి కనెక్షన్లు ఇస్తున్నారని సమాచారం. కొత్త కొళాయి కనెక్షన్‌కు పంచాయతీకి రూ.13వేలు చెల్లించాల్సి ఉంది. అయితే కిందిస్థాయి సిబ్బంది అదనంగా కనెక్షన్ ఇచ్చి ఆ నగదును తమ జేబుల్లో వేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కనెక్షన్ల పేరుతో సిబ్బంది కలెక్షన్లు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అదే సమయంలో పంచాయతీ అధికారులకువాటాలు చేరడంతో చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి.

గంగ పైపులైను ధ్వంసంపై అనుమానాలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తెలుగుగంగ నీటిని రేణిగుంట పంచాయతీకి కేటాయిస్తూ అప్పట్లో రూ.30కోట్లు వెచ్చించి మంగళం పంప్‌హౌస్ నుంచి కొత్త పైపులైన్ నిర్మించారు. అయితే పంచాయతీలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది వేసవిలో ఉద్దేశపూర్వకంగా మంగళం వద్ద పైపులైన్లను పగులగొట్టి లక్షల్లో బిల్లులు పెట్టుకుని దోచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ విషయాలపై విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ ప్రచారంలో ముక్కంటి ఆలయ ఉద్యోగి

● వేటు వేసేందుకు రంగం సిద్ధం



వైసీపీ ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి వ్యక్తిగత కార్యదర్శి మనోజ్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముక్కంటి ఆల యం ఒప్పంద ఉద్యోగిపై వేటు వేసేం దుకు రంగం సిద్ధమైంది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డికి మనోజ్ పీఏగా వ్యవహరిస్తుంటాడు. గత ఏడాది జూన్‌లో మనోజ్ ముక్కంటి ఆలయంలో ఒప్పంద ప్రాతిపదికన కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమితులయ్యాడు. అయితే మనోజ్ విధులకు హాజరు కాకుండానే మ్యానేజ్ చేసేవాడు. వైసీపీ సిద్ధం సభలో మనోజ్ ప్రచారంలో పాల్గొన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారంపై ఆదివారం శ్రీకాళహస్తి ఆర్డీవోకు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఆలయ ఈవో నాగేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో అతడిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

బహుమతుల పంపిణీపై అభ్యంతరాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7: ముస్లిం మహిళలకు చీరలు, బహుమతులు పంపిణీ చేయడంపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. శ్రీకాళహస్తి వీఎంసీ కూడలి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం వైసీపీ నేతలు భారీ ఎత్తున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇక్కడకు అత్యంత సమీపంలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న సందులోని ఓ ఇంట్లో ముస్లిం మహిళలకు చీరలు, బహుమతులు పంపిణీ చేశారు. అక్కడ బహుమతులు స్వీకరించిన వారంతా నేరుగా ఇఫ్తార్ విందుకు వెళుతూ కనిపించారు. దాంతో ఎన్నికలవేళ ప్రలోభాలకు దిగినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసింది. అయితే అక్కడ పంపిణీ చేస్తున్న వ్యక్తి రాజకీయ పార్టీలతో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కలంకారీ కళాకారులుగా ఎంతో కాలం నుంచి తన కుటుంబం ప్రతి సంవత్సరం ముస్లిం మహిళలకు రంజాన్ సందర్భంగా చీరలు పంపిణీ చేస్తోందని చెప్పారు. అదే తరహాలో ఏడాది కూడా కొనసాగించామని తెలియజేశారు. అయితే అక్కడ బహుమతులు అందుకున్న వారంతా వైసీపీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు వైపు అడుగులు వేయడంపై పట్టణ ప్రజలకు అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

గిరిజనులను దగా చేసిన వైసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7: గిరిజనులను దగా చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద గిరిజనులపై వైసీపీ నాయకులు అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. చంద్రబాబు గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనులంతా వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నాయకులు రమేష్, మణి, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.